హరిహరపురం కాలనీ అభివృద్ధికి కృషి


ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

వనస్థలిపురం: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ హరిహర పురం కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం హరిహరపురం కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కలిసి కాలనీ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. రాబోయే వర్షాకాలంలో ఎగువ కాలనీల నుంచి వచ్చే వరద నీరు కాలనీని ముంచెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో అరవింద్‌రెడ్డి, శంకర్‌గౌడ్, సందీప్‌రెడ్డి, మురళీకృష్ణ, నరేష్, పృథ్వీ, కేవీఎస్.రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, మధుకర్ ఉన్నారు.

శాంతి భద్రతలకు సహకరించాలి


ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్‌ను సన్మానించిన కార్పొరేటర్

సైదాబాద్: శాంతి భద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలని సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్ కోరారు. సైదాబాద్ ఇన్‌స్పెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆయనను గురువారం ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి, బీజేపీ నాయకులతో కలిసి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మధుకర్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి, రేణుక, సరిత, సుష్మ, రమాదేవి ఉన్నారు.

ఘనంగా పల్లకిసేవ


పల్లకి సేవలో పాల్గొన్న ఉప్పల శ్రీనివాసగుప్తా

నాగోలు: వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి పురస్కరించుకొని కొత్తపేట వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం నుంచి చైతన్యపురి, దిల్‌సుఖ్‌నగర్, సరూర్‌నగర్ వరకు పల్లకి సేవ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా పాల్గొని మాట్లాడారు. వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆశీస్సులతో అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మొగుళ్ళ పల్లి ఉపేందర్ గుప్త, చింతల బాలరాజు, ఎల్‌వీ కుమార్, నవీన్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

జోరుగా తాటిముంజల విక్రయాలు


మలక్‌పేటలో తాటి ముంజలు కొనుగోలు చేస్తున్న చిరు వ్యాపారులు

మలక్‌పేట: మలక్‌పేటలో తాటిముంజల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. మలక్‌పేట పోలీస్‌స్టేషన్ వెనుక భాగంలో తాటి ముంజల మార్కెట్ కొనసాగుతుంది. వేసవి వచ్చిందంటే ప్రతీ సంవత్సరం ఇక్కడ ముంజల అమ్మకాలు జోరుగా సాగుతుంటాయి. నల్లగొండ, యాదాద్రి, రంగారెడ్డి జిల్లాలకు చెందిన గౌడ కులస్థులు ఆటోలలో ఈ మార్కెట్‌కు తరలిస్తారు. చిరువ్యాపారులు ఇక్కడే కొనుగోలు చేసిన ముంజలను మలక్‌పేట, చాదర్‌ఘాట్, దిల్‌సుఖ్‌నగర్, పాతబస్తీ ప్రాంతాల్లో తిరిగి విక్రయిస్తారు.

కలుషిత నీటి సరఫరాకు చెక్


నూతన మ్యాన్‌హోల్ ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

మన్సూరాబాద్: మన్సూరాబాద్ ఓల్డ్ విలేజ్‌లో కలుషిత నీటి సరఫరాకు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆదేశాలతో చెక్ పడింది. జలమండలి జనరల్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, మేనేజర్ ప్రేమ్ కుమార్‌లతో పాటు మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి ఓల్డ్ విలేజ్‌కు చేరుకుని డ్రైనేజీ పైపులైన్‌లను పరిశీలించారు. డ్రైనేజీ మ్యాన్‌హోల్ వద్ద మురుగునీరు మంచినీటి పైపులైన్స్‌ వద్ద కలుస్తుందని గుర్తించి నూతన మ్యాన్‌హోల్‌ను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించారు.

పార్కులపై పర్యవేక్షణ కరువు

- కానరాని కనీస వసతులు
- విరిగిపోయిన ఆట పరికరాలు
- దృష్టి సారించాలంటున్న సందర్శకులు
- విస్మరిస్తున్న అధికారులు


పచ్చదనం లేక కళావిహీనంగా మారిన ప్రభాత్‌నగర్ పార్కు

చైతన్యపురి: పార్కుల అభివృద్ధి పట్ల పాలకులు, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. అవసరమైన సౌకర్యాలు కల్పించకపోవటంతో పచ్చదనంతో ఉండాల్సిన పార్కులు కళావిహీనంగా మారుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో పార్కు స్థలాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతుండగా కొన్ని కాలనీల్లోని పార్కులు అభివృద్ధికి దూరంగా ఉన్నాయి. చైతన్యపురి డివిజన్ ప్రభాత్‌నగర్‌లోని పార్కు నిర్వహణ సక్రమంగా లేక సాయంకాలం ఇక్కడకు వచ్చే వారు ఇబ్బందులు పడుతున్నారు.

పేరుకుపోతున్న చెత్త కుప్పలు

పచ్చదనం ఉండాల్సిన పార్కుల్లో చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి.కనీసం నడిచే దారి కూడా శుభ్రం చేయకపోవటంతో అడుగుపెట్టలేని దుస్థితి నెలకొంది. నిత్యం సమీప కాలనీల ప్రజలు సాయంకాలం తమ పిల్లలను తీసుకుని ఈ పార్కుకు వస్తుంటారు. వారికి ఆట పరికరాలు లేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఉన్న ఆట పరికరాల్లో కొన్ని ధ్వంసం కాగా మరికొన్ని విరిగిపోయాయి.ఉయ్యాలకు సంబంధించిన ఇనుప రాడ్డు విరిగిపోయి ప్రమాదకరంగా మారింది.పార్కులో ఉన్న కొన్ని మొక్కలకు సరిగా నీరు పోయకపోవటంతో అవి ఎండిపోతున్నాయి.కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు కూడా ఈ పార్కు అభివృద్ధి గురించి పట్టించుకోవటం లేదని పలువురు కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. పార్కు ప్రహరీ బయట భవన నిర్మాణ వ్యర్థాలు కుప్పలు కుప్పలుగా పేరుకుపోయాయి. వేసవి సెలవులలో పిల్లలను ఇక్కడకు తీసుకొస్తే ఇక్కడ సౌకర్యాలు సరిగా లేవని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆయా ప్రార్కుల్లో అన్ని వసతులు కల్పించాలని కోరుతున్నారు.


పాడైపోయిన ఆటపరికరాలు



ఊయల రాడ్ విరిగిపోయి ప్రమాదకరంగా మారిన దశ్యం

యుద్ధం వస్తే ఆర్మీకి మా లారీలు ఇస్తాం


ర్యాలీ నిర్వహిస్తున్న లారీ యజమానుల సంఘం ప్రతినిధులు

వనస్థలిపురం: పాకిస్తాన్ భారత్‌తో యుద్ధానికి దిగితే ఇండియన్ ఆర్మీకి మా లారీలతో ఇస్తామని తెలంగాణ రాష్ట్ర లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బూడిద నందారెడ్డి అన్నారు. కశ్మీర్‌లోని పహల్గాంలో టూరిస్టులపై ఉగ్రవాదులు దాడి చేసి 28 మందిని హత్యచేసిన ఘటన నేపథ్యంలో భారత ప్రధాని నరేంద్రమోదీ ఆపరేషన్ సిందూర్ పేరుతో ఉగ్రవాదుల శిబిరాలపై దాడి చేసి మట్టుపెట్టినందుకు హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం రాత్రి ఆటోనగర్ నుంచి వనస్థలిపురం సుష్మా చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాంరెడ్డి, రాజుగౌడ్, నర్రి వెంకన్న, కొండల్‌రెడ్డి, అల్వాల్ రెడ్డి, శ్రీనివాస్, జగదీష్‌యాదవ్, జంగారెడ్డి, మహేష్ యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, రవిగౌడ్, జంగా రెడ్డి, మల్లారెడ్డి, నరేష్‌గౌడ్ పాల్గొన్నారు.

పాక్‌కు సరైన గుణపాఠం చెప్పాలి


జాతీయ జెండాలతో బీజేపీ నాయకులు

చంపాపేట: ఉగ్రవాదులను పెంచి పోషించే పాకిస్తాన్‌కు సరైన గుణపాఠం చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని రాష్ట్ర బీజేవైఎం ఎగ్జిక్యూటివ్ సభ్యుడు సిల్వేరి అనిల్‌కుమార్ అన్నాడు. గురువారం సిందూర్ ఆపరేషన్‌కు మద్దతుగా బీజేపీ నాయకుడు పాశం శ్రీశైలం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను చేతబూని వందేమాతరం అనే నినాదాలతో మారుతీనగర్ కాలనీ నుంచి ర్యాలీ నిర్వహించారు. 200 మంది పాకిస్తాన్ ఉగ్రవాదులను భారత సైన్యం మట్టుబెట్టిన సందర్భంగా చంపాపేట చౌరస్తాలో స్వీట్లను పంచిపెట్టి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ..ముష్కరులు భారత్ వైపు కన్నెత్తి చూసేందుకు కూడా భయపడే విధంగా పాకిస్తాన్‌పై చర్యలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు భానుగ రమేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తిని పెంపొందించాలి


విజేతలకు బహుమతులు అందజేస్తున్న దిలీప్‌రెడ్డి

మలక్‌పేట: ప్రతి ఒక్కరిలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించాలని శ్రీసాయి డిగ్రీ, పీజీ కాలేజీ ప్రిన్సిపాల్ దిలీప్‌రెడ్డి అన్నారు. దిల్‌సుఖ్‌నగర్ కాలేజీలో గురువారం నిర్వహించిన స్పోర్ట్స్‌డే వేడుకలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు దేహదారుఢ్యంతో పాటు ఆరోగ్యానికి దోహదపడతాయన్నారు. విద్యార్థులకు ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రోత్సహిస్తే మరింత రాణించి ఉన్నత స్థానాలకు చేరుకుంటారన్నారు. అనంతరం వివిధ పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస ఆచారి, లెక్చరర్లు శేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, శోభారాణి, మమత, అపర్ణ, నజీరా, షర్మిల, గౌరీప్రియ, సుష్మా పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి


పోస్టర్‌ను విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

నాగోలు: ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కోశాధికారి గోకమల్ల చైతన్య, జిల్లా సహాయ కార్యదర్శి మల్లెపాక వీరయ్య పిలుపునిచ్చారు. గురువారం కొత్తపేట డివిజన్ న్యూనాగోలులో భవన నిర్మాణ కార్మిక సంఘం సీఐటీయూ ఆధ్వర్యంలో ఎండీ లతీఫ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సమ్మెకు సంబంధించిన వాల్‌పోస్టర్‌లను విడుదల చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం పూర్తిగా కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతుందని దీంతో అన్ని రంగాలలోని కార్మికులంతా ఐక్యంగా ఉద్యమించి సాధించుకున్న హక్కులను కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చంద్రయ్య, ఎండీ రహీం, హనుమంతు,రామస్వామి, జగన్, సీహెచ్ వెంకటయ్య, ఎం రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రజల శ్రేయస్సే ముఖ్యం


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: ప్రజల శ్రేయస్సే ముఖ్యమని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి స్పష్టం చేశారు. హయత్‌నగర్ పరిధిలో అంజలి రెసిడెన్సీ కాలనీలో కొనసాగుతున్న ట్రంక్‌లైన్ పనులను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ట్రంక్‌లైన్ పనులకు అడ్డంకులు కల్పించవద్దని కాలనీలవాసులకు సూచించారు. సరైన లెవల్స్ పాటిస్తూ పైపులైన్‌లు వేస్తున్నారా.. లేదా అని తాను పర్యవేక్షిస్తానని తెలిపారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించేందుకు ప్రయత్నిస్తే ఉపేక్షించేది లేదని, హైడ్రా, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా కాపాడుతానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అమరేందర్‌రెడ్డి, శ్రీహరి, కృష్ణమోహన్, గోవర్ధన్‌చారి, ఓంకార్, రామారావు, రాంమ్మోహన్, శంకర్‌రెడ్డి, సుధాకర్‌గౌడ్, మురళీ, రవీందర్‌రెడ్డి, సోమనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పాకిస్తానీయులు, రోహింగ్యాలను బహిష్కరించాలి

మన్సూరాబాద్: రంగారెడ్డి జిల్లాలో అక్రమంగా నివసిస్తున్న పాకిస్థానీయులు, బంగ్లాదేశ్ రోహింగ్యాల బహిష్కరించాలని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి కార్పొరేటర్లు, నాయకులతో కలిసి గురువారం ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లా పరిధిలో కొన్ని ప్రాంతాల్లో రోహింగ్యాలు, పాకిస్థానీయులు అక్రమంగా నివాసముంటున్నారని అనుమానాస్పద ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్ చేపట్టి అక్రమ వలసదారులను గుర్తించి చర్యలు చేపట్టాలని కోరారు. జిల్లాలో రోహింగ్యాలు అక్రమంగా నివసిస్తున్నారనే భయంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో సామ రంగారెడ్డి, కార్పొరేటర్లు కొప్పుల నర్సింహ్మారెడ్డి, వంగ మధుసూధన్‌రెడ్డి, మొద్దు లచ్చిరెడ్డి, బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, నాయకులు కొత్త రవీందర్‌గౌడ్, చింతల సురేందర్‌యాదవ్, బండారు భాస్కర్, నాంపల్లి రామేశ్వర్, నందికొండ గీతారెడ్డి పాల్గొన్నారు.

సమ్మె పోస్టర్ల ఆవిష్కరణ


సమ్మె పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ, ప్రజాసంఘాల నాయకులు

మీర్‌పేట: కార్మిక వ్యతిరేక నిబంధనలను కేంద్రం వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ బాలాపూర్ మండల అధ్యక్షులు దాసరి బాబు డిమాండ్ చేశారు. మే 20న చేపట్టనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె పోస్టర్లను గురువారం బాలాపూర్ చౌరస్తాలో ప్రజా సంఘాల నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులంతా సమ్మెలో పాల్గొని ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకునే వరకు ఉద్యమం కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ శేఖర్‌యాదవ్, గౌరవ అధ్యక్షుడు యాదగిరిచారి, ఐఎన్‌టీయూసీ నాయకులు శివ, ఏఐటీయూసీ నాయకులు నరేందర్, కృష్ణ, వెంకయ్య, దాసరి నర్సింహ, మల్లికార్జున్, బన్నీ, సోని, దేవి, రాజేష్, తిరుపతయ్య పాల్గొన్నారు.


లేమూరులో సమ్మె కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు, ఆశ వర్కర్లు

సమ్మెను విజయవంతం చేయాలి..

కందుకూరు: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 20న చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం మండల పరిధిలోని లేమూరులో సమ్మె కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ మాట్లాడుతూ.. కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా తెచ్చిన లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రూ.26 వేల కనీస వేతనాన్ని అమలు చేయాలన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్, బీమాతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు శేఖర్, ఆశ వర్కర్లు సుశీల, సంధ్య, పోచమ్మ, లక్ష్మమ్మ, భారతి, చంద్రకళ పాల్గొన్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమాటా రూ.13, వంకాయ రూ.18, బెండ రూ.41, పచ్చిమిర్చి రూ.35, కాకరకాయ రూ.40, బీరకాయ రూ.45, కాలిఫ్లవర్ రూ.23, క్యాబేజీ రూ.08, క్యారెట్ రూ.21, దొండ రూ.35, ఆలుగడ్డ రూ.25, ఉల్లిగడ్డ రూ.16, గోకరకాయ రూ.40, దోసకాయ రూ.18, సొరకాయ రూ.09, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.09, చిక్కుడుకాయ రూ.65, చామగడ్డ రూ.35, మునగ రూ.60, కందగడ్డ రూ.85, బీట్‌రూట్ రూ.19, కీర రూ.37, బీన్స్ రూ.115, క్యాప్సికమ్ రూ.45. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

యువకుడి అదృశ్యం


రోహిత్(20)

మలక్‌పేట: ఇంటి నుంచి బయటికి వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమైన ఘటన మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై సంజీవరెడ్డి వివరాల ప్రకారం.. మూసారంబాగ్ డివిజన్ ఫ్రెండ్స్‌కాలనీలోని శివకుమార్ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న బి. సత్యనారాయణ కొడుకు రోహిత్(20) అలియాస్ చింటూ ఈ నెల 1న ఇంటి బయటికి వెళ్లి ఎంతకీ రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నేడు ఎంకే రాముకు స్మారక సాంస్కృతిక పురస్కారం

చిక్కడపల్లి: ప్రముఖ కవి, రసమయి సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపకుడు ఎంకే రాముకు కళా సుబ్బారావు స్మారక సాంస్కృతిక పురస్కారాన్ని ప్రదానం చేస్తున్నామని త్యాగరాయ గానసభ అధ్యక్షుడు జనార్ధనామూర్తి తెలిపారు. గురువారం ఆయన గానసభ ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. ఈ శుక్రవారం సాయంత్రం 5గంటలకు త్యాగరాయ గానసభలో జరిగే సాంస్కృతిక అభిమాని, కళా పోషకుడు కళా సుబ్బారావు జయంతి కార్యక్రమంలో ప్రదానం చేస్తామన్నారు.

సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

మన్సూరాబాద్: సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్(సీఐటీయూ) ఆధ్వర్యంలో ఆటోనగర్‌లోని పారిశ్రామిక వాడలో గురువారం సార్వత్రిక సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి చంద్రమోహన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత కొన్నేళ్లుగా పాలకవర్గాలు ప్రభుత్వ రంగాన్ని అవహేళన చేస్తూ ప్రభుత్వ రంగ పరిశ్రమల వాటాలను పారిశ్రామికవేత్తలకు కారు చౌకగా అమ్మి ప్రజాధనాన్ని లూటి చేస్తున్నాయని విమర్శించారు. లేబర్ కోడ్‌లు తీసుకువచ్చి కార్మిక వర్గాన్ని బానిసలుగా మార్చిందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి, నాయకులు కృష్ణయ్య, నరహరి, వెంకటమ్మ, శ్రీదేవి పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నేతలు

ఆర్మీకి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నాం

అవేర్ సంస్థ చైర్మన్ మాధవన్‌జీ


జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న అవేర్ సంస్థ చైర్మన్ మాధవన్‌జీ, డైరెక్టర్లు

మహేశ్వరం: పహల్గామ్‌లో అమాయకుల ప్రాణాలను బలి తీసుకున్న పాకిస్థాన్ ఉగ్రవాదులకు తగిన బుద్ధి చెప్పేందుకు ప్రధాని మోదీ, ఇండియన్ ఆర్మీకి తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని అవేర్ సంస్థ చైర్మన్ మాధవన్‌జీ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని మొహబ్బత్‌నగర్ గ్రామ సమీపంలోని భగవతీపురం అవేర్ క్యాంపస్‌లో సంస్థ డైరెక్టర్లు, సభ్యులతో సర్వసభ్య సమావేశం నిర్వహించి క్యాంపస్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ భద్రత విషయంలో ప్రధాని మోదీ, ఇండియన్ ఆర్మీ తీసుకునే నిర్ణయాలకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. పహల్గామ్‌లో అమాయక పర్యాటకులపై పాకిస్థాన్ ఉగ్రవాదులు దాడులు నిర్వహించి పొట్టనపెట్టుకున్నారని, దానికి విరుగుడుగా ఆపరేషన్ సిందూర్ పేరుతో పాకిస్థాన్ ఉగ్రవాదులపై మెరుపుదాడులు నిర్వహించి హతం చేయడం గర్వించదగిన విషయమన్నారు. దేశం కోసం పోరాడేందుకు తాము సైనికులుగా ఎప్పుడైన సిద్ధంగా ఉన్నామని వారు పేర్కొన్నారు. ఉగ్రదేశమైన పాకిస్థాన్‌కు భారత్ తగిన బుద్ధి చెప్పాలని కోరారు. అంతకుముందు జై హిందూ అంటూ నినాదాలు చేస్తూ క్యాంపస్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అవేర్ డైరెక్టర్లు రాజవర్ధన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, వరుణ్, తరుణ్, సభ్యులు రమాకాంత్, ఇర్షాద్, జాఫర్, వెంకన్న, ప్రభాకర్, గణేష్, రీనా, కళ పలువురు పాల్గొన్నారు.

సాయినగర్ బాధితులను ఆదుకోవాలి


కాలిపోయిన గుడిసెలను పరిశీలిస్తున్న కూనంనేని సాంబశివరావు


నగదు అందజేస్తున్న తహసీల్దార్ వాణిరెడ్డి

నాగోలు: సాయినగర్ బాధితులకు ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. గురువారం ఆయన సాయినగర్ కాలనీలో కాలిపోయి గుడిసెలను పరిశీలించి మాట్లాడారు. అగ్ని ప్రమాదంతో నష్టపోయిన బాధితులకు తక్షణమే ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా పేదలకు పక్కా గృహాలను నిర్మించి ఇవ్వాలన్నారు. రెక్కాడితే గాని డొక్కాడినే నిరుపేదలు అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయి దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో చందునాయక్, ఫైమీద, సామిడి శేఖర్ రెడ్డి, బాతురాజు నరసింహ, రాములు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

నాగోలు: నాగోలు సాయినగర్‌లో గుడిసెలు దగ్ధమైన ఘటనలో ప్రభుత్వం నుంచి తక్షణ సహాయంగా ఒక్కో కుటుంబానికి రూ.10 వేల చొప్పున గురువారం ఉప్పల్ తహసీల్దార్ వాణిరెడ్డి, నాగోలు కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ చేతుల మీదగా అందజేశారు. ఘటన జరిగిన రోజు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మాల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, కాంగ్రెస్ నాయకులు మధుయాష్కీ గౌడ్ గుడిసెల ప్రాంతాన్ని సందర్శించి బాధితులను పరామర్శించారు. మధుయాష్కీగౌడ్ వెంటనే స్పందించిన గుడిసెలు కాలిపోయిన వారికి తన వ్యక్తిగతంగా రూ.3 వేల చొప్పున నగదు, బియ్యాన్ని అందజేశారు. వెంటనే కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్‌తో మాట్లాడిన మధుయాష్కీ తక్షణం ఆర్థిక సహాయం చేయాలని సూచించారు. నిబంధనల ప్రకారం రూ.6 వేలు ఇస్తామని అధికారులు చెప్పగా కనీసం రూ.10 వేలు ఇచ్చేందుకు కలెక్టర్ అంగీకరించారు. పైస్థాయి అధికారులకు సూచన మేరకు గురువారం బాధితులకు నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో మంజులరెడ్డి, భవానిగౌడ్, చిరంజీవి, రవి, రజినిరావు, రాజేశ్వరి, బొంగు వెంకటేష్ గౌడ్, భద్రు నాయక్ పాల్గొన్నారు.